క్లుప్తంగా

చర్చలకు పిలవాలి

కడప సెవెన్‌రోడ్స్ : గత 26 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ల కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్‌లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెకు డీవైఎఫ్ఐగా సంఘీభావం తెలియజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవకుండా వారిని కనీసం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే ఆదిల్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఎం. చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరం జిల్లా పరిషత్ ఆవరణంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శ్రీ సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శంకరాపురానికి చెందిన తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య డెవెలపర్స్ అధినేత కె. సురేంద్రనాథ్, సంఘ సభ్యులు శివప్రసాద్ రెడ్డి, పెయ్యాల అశోక్, వలీబాషా, ప్రసాద్‌నాయుడు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఫిలాసఫీలో డాక్టరేట్

కడప రూరల్ : కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ)ని అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం నుంచి కడపకు చెందిన వై.సుబ్బరాయుడు డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక బీసీ ఐక్యవేదిక జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వేదిక అధ్యక్షుడు నాగమల్లేష్ మాట్లాడుతూ సుబ్బరాయుడు కోవిడ్-19 వంటి ప్రాణాంతక వ్యాధులపై మషీన్ లర్నింగ్ ఆధారిత పరిష్కారాల ద్వారా ముందస్తు హెచ్చరికలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వినూత్న విధానాలను కనుగొన్నారు. ఫిలాసఫీ కోర్సు మార్గదర్శకులు ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు మెంటార్‌గా సహకారం అందించారు. సుబ్బరాయుడుకు డాక్టరేట్ రావడం పట్ల బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నచ్చయ్యగారి నాగమల్లేష్, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎస్టీలకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలి

కడప రూరల్ : రాయలసీమ వ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాలకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ గిరిజన వర్గాలకు ఎటువంటి బడ్జెట్‌ను కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రమావత్ జగన్ రాథోడ్ పాల్గొన్నారు.

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలి



డీఈఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీకు న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కడపలోని కార్యాలయంలో ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సివి ప్రసాద్ ,రాధాకృష్ణలు కలిసి పదోన్నతులపై చర్చించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో గ్రేడ్ 2 హెడ్మాస్టర్ పదోన్నతుల అడక్వసి వివరాలపై డీఈఓ చర్చించినట్లు తెలిపారు. ఎస్టీకి అడక్వసి పూర్తయిందని, ఎస్సీకి నాలుగు పోస్టులు రిజర్వేషన్ ద్వారా భర్తీ చేస్తామని స్పష్టంగా తెలిపారని వారు వివరించారు.

బస్సుకు ప్రమాదం

చింతకొమ్మదిన్నె : రాయచోటి నుంచి కడపకు వస్తూ గువ్వలచెరువు ఘాట్ పైన నాలుగో మలుపు వద్ద ఇంట్రాసిటీ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లే క్రమంలో అడ్డుగా వేసిన మట్టిదిబ్బ పైకి ఎక్కి ఆగిపోయింది. ఈ కారణంగా బస్సుకు పెను ప్రమాదం తప్పింది.

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చలువ పందిళ్లు



వేసవి కాలంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు ప్రయాణీకులకు సేద తీరుస్తున్నాయి. మధ్యాహ్న వేళల్లో సూర్య ప్రతాపం ఎక్కువగా ఉన్న సమయంలో ఎండ వేడిమి నుంచి ఈ పందిళ్లు కాపాడుతున్నాయి. అలాగే వర్షానికి సైతం ఇవి గొడుగులాగా ఉపయోగపడుతున్నాయి. పోలీసుల ఆలోచనకు ప్రజలు హాట్సాఫ్ చెబుతున్నారు. - ఫోటోలు: సాక్షి ఫోటోగ్రాఫర్, కడప



31న శిక్షణా తరగతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కారు డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, ఫోటో, వీడియోగ్రఫీలో ఈనెల 31వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు కొనసాగే శిక్షణకు 18-45 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా గంధం

కడప కల్చరల్ : కడప నగరం వన్‌టౌన్ సర్కిల్ వద్దగల హజరత్ ఖాజా సయ్యద్‌షా మొహమ్మద్ షహబుద్దీన్ (మోహర్ అలీ షా) 428వ ఉత్సవాల్లో భాగంగా గంధం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాబాషహుసేని సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతి ఫకీర్ల మేళ తాళాలతో గంధాన్ని దర్గా కు తీసుకొచ్చి దర్గాలో గంధాన్ని సమర్పించి, ఫాతెహా చేసి ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



దర్గా వద్దకు గంధాన్ని తీసుకొస్తున్న పీఠాధిపతి, భక్తులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల కిశోర్‌బాబు, రాజేంద్రారెడ్డిలు కోరారు. శుక్రవారం ఈ మేరకు వారు డిపో మేనేజర్ డిల్లీశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలికంగా ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించి తగిన న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈనెల 28, 29 తేదీలలో నిరాహార దీక్షలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక పరిషత్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప అగ్రికల్చర్: రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏపీ రైతు బజార్ సీఈఓ మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని రైతుబజార్‌ను ఆమె మార్కెటింగ్‌శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతు బజార్‌ను పరిశీలించడంతోపాటు రైతు బజార్‌లో కూరగాయలు అమ్ముకుంటున్న రైతులతో చర్చించారు. నిర్ణీతమైన ధరలకే కూరగాయలు అమ్మాలని దీంతోపాటు రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. డ్రైనేజీలో కుళ్లిన కూరగాయలను పడేయటం వంటి పనులను చేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ సుబ్బారెడ్డి, ఏడీ అజాద్‌వల్లి, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ నాయక్ తదితరులు ఉన్నారు.



రైతు బజార్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న ఏపీ రైతు బజార్ సీఈఓ మాధవీలత

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ



ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో బాలవికాస్ సంస్థ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కడప ఎర్రముక్కపల్లె బాలవికాస్ విద్యాసంస్థలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు తమ ప్రతిభను చాటి అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి 300 మార్కులకుగాను 250 మార్కులను 8 మంది విద్యార్థులు సాధించగా 200 మార్కులను మరో 41 మంది సాధించి తమ ప్రతిభను చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించిన వారిలో కేదారి హస్విత 300 మార్కులకు 282 మార్కులు, నాగదీక్షిత్‌రెడ్డి 277, భానుతేజరెడ్డి 266, వరదరాజ 266, మనస్వి 266, చక్రదేవ 262, తేజోవంత్‌రెడ్డి 258, సాకేత్‌రెడ్డి 254 మార్కులు సాధించి భళా అనిపించారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆ సంస్థ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, కో ఆర్డినేటర్ ధరణికుమార్, డైరెక్టర్ గంగయ్యలు అభినందించారు.

జేవీవీ శిబిరంలో విజ్ఞాన కార్యక్రమాలు



మాట్లాడుతున్న కడప ఎంఈఓ ఇర్షాద్ అహ్మద్

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కడప నగరంలో జరుగుతున్న విజ్ఞాన దాయకమైన పలు కార్యక్రమాలు విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. కడప మండల విద్యాశాఖాధికారి ఇర్షాద్ అహ్మద్ శుక్రవారం శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్ , పాటలు, సరదాతో శాస్త్రీయ విజ్ఞానం నేర్పించే కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి శిబిరాలు విద్యార్థుల్లో అవగాహన ,ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణ భావనను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. పాఠశాల పాఠ్యాంశాలతోపాటు ఇలాంటి అనుభవాలు పిల్లలలో శాస్త్రీయ కోణాన్ని అభివృద్ధి చేస్తాయన్నారు. ఈ దిశగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తుండడంతో రాబోయే రోజుల్లో మరిన్ని విభిన్న, వినూత్న అంశాలతో ఈ సమ్మర్ క్యాంపు కొనసాగిస్తామని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం సీఎస్ అంజాద్ అలీ , ఎస్‌ఎం సీ చైర్మన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అబ్దుల్ గఫూర్, కామేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

కమలాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న పనుల నాణ్యతలో రాజీ పడొద్దని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ సభా భవనంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన క్లస్టర్ పరిధిలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం రైతు పొలాల్లో జరుగుతున్న ఫాం పాండ్స్, పశువుల నీటి తొట్టెల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించి పనులు రికార్డు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులను ఒప్పించి వారి పొలంలోనే కొంత విస్తీర్ణంలో ఫాం పాండ్స్, పశువులకు నీటి తొట్లు నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలన్నారు. ముఖ్యంగా పనుల రికార్డును నిబంధనల మేరకు నమోదు చేయాలన్నారు. ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామికుల సంఖ్యను పెంచి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశంలో గ్రామికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారథి, కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, పెండ్లిమర్రి, చెన్నూరు, సీకే దిన్నె, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



విశ్వనాథపురంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ఎడ్లు

చాపాడు : మండలంలోని విశ్వనాథపురంలో శ్రీవీరాంజనేయస్వామి జయంతోత్సవ వేడుకలలో భాగంగా రెండు రోజులుగా జరుగుతున్న వీరాంజనేయస్వామి తిరునాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు, చెక్కభజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నంద్యాల జిల్లా ఎడ్లకు ప్రథమ బహుమతి..

విశ్వనాథపురంలో జరిగిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరుకు చెందిన కట్టుబడి రోలి మేడంకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో గెలుపొందాయి. ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు ద్వితీయ, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొత్తపల్లికు చెందిన జొజ్జ విద్య ఓబుళరెడ్డి, నారాయణస్వామి ఎడ్లు తృతీయ, ఇదే మండలం వరదాయపల్లెకు చెందిన బెస్త శ్రీరాములు ఎడ్లు నాల్గవ, చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన లింగారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఎడ్లు ఐదవ, వేంపల్లె మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణయ్య ఎడ్లు ఆరవ, వల్లూరు మండలం గోసురువారిపల్లెకు చెందిన పాపిరెడ్డి వెంకటరమణారెడ్డి ఎడ్లు ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు వరుసగా రూ.70 వేలు రాజువారిపేట వెన్నపూస వెంకటసుబ్బారెడ్డి, రూ,50 వేలు అల్లాడుపల్లె గోసుల మునెయ్యగారి కిషోర్‌కుమార్‌రెడ్డి, రూ.40 వేలు అయ్యవారిపల్లె పి.మునిశేఖర్‌రెడ్డి, రూ.30 వేలు విశ్వనాథపురం గ్రామస్తులు, రూ.20 వేలు నెర్రవాడ బుర్రి నాగరాజు, రూ.10 వేలు వీవీ కొట్టాలు వి.రాజశేఖర్‌రెడ్డి, రూ.5 వేలు విశ్వనాథపురం మార్తల రమణారెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, విశ్వనాథపురం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి

సిద్దవటం : వరి నారు పోసే ప్రతి రైతు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని, తద్వారా విత్తనం భూమి ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చునని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్ధవటం మండలంలోని పెద్దపల్లి, బొగ్గిడివారిపల్లె, మాధవరం-2 రైతు సేవా కేంద్రాలను శుక్రవారం బద్వేల్ ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అర్హులైన రైతుల జాబితాను పరిశీలన ప్రక్రియను సమీక్షించామన్నారు. అలాగే మట్టి నమూనాలను సేకరించడం పూర్తి చేసి 24తేదీ రైతుల జాబితాతో సహా ఊటుకూరులోని భూసార పరీక్షా కేంద్రంలో సబ్మిట్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. జూలైలో పసుపు సాగు చేస్తారని, అంతకు ముందే నవధాన్యాల విత్తనాలతో పీఎండీఎస్ సాగు చేపట్టాలని తద్వారా భూసార వృద్ధి, సేంద్రియ కర్బనం శాతం పెరుగుతుందన్నారు. రైతు పొలంలో కనీసం 1 శాతం సేంద్రియ కర్బనం ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న జనుము విత్తనాలకు ఇతర పప్పు దినుసులు, నూనె గింజలు, ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఇతర రకాల విత్తనాలు కలిపి సాగు చేయడం రైతులు అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ 2025 ప్రణాళికపై చర్చించి తగు సూచనలు ఇచ్చారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

వల్లూరు : ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గోటూరుకు చెందిన రైతు గంగాధర్ పొలములో ఉపాధి పథకం కింద చేపట్టిన ఫారం పాండును శుక్రవారం ఆయన సందర్శించారు. మండలంలో ఈనెలాఖరుకు 82 ఫారంపాండ్‌లు పూర్తి చేయవలసి ఉండగా 28 పూర్తి చేశారని, మిగిలినవి తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు.

ప్రజల గుండెల్లో తిరుగులేని నేత వైఎస్ రాజారెడ్డి

పులివెందుల టౌన్ : తెలుగు ప్రజల గుండెల్లో తిరుగులేని నాయకుడు దివంగత నేత వైఎస్ రాజారెడ్డి అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో దివంగత నేత, వైఎస్సార్ తండ్రి వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాయన వైఎస్ రాజారెడ్డికి పులివెందుల చరిత్రలో ఒక ప్రత్యేకత ఉందన్నారు. పేదలకు తమ కుటుంబాన్ని నమ్ముకున్న వారికి అండగా నిలిచేవారని, కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు చిరస్మరణీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధర రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, నూర్‌బాషా సంఘ రాష్ట్ర నాయకులు రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిశోర్, రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, కౌన్సిలర్లు కోడి రమణ, రాజశేఖర్, ఖాదర్ బాషా, కోఆప్షన్ చంద్రమౌళి, నాయకులు సోపాల వీరా, పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, సంపత్, రవి, మస్తాన్, కనక, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, ఫైర్ రామకృష్ణ, చెన్నకేశవులు, రమేష్, రాజేష్, బ్యాటరీ ప్రసాద్, బాల అశ్వత్థరెడ్డి, తోటం శెట్టి హరి, శ్రీరామసుబ్బయ్య, బీసీ నాయకులు కార్తీక్, మారుతిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ రాజారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

ఛలో సంగమేశ్వరం జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మల్లేల జగదీష్ తదితరులు

కడప రూరల్ : రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదిన నిర్వహిస్తున్న ఛలో సంగమేశ్వరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానికంగా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణంపై ఈనెల 31న సంగమేశ్వరం దగ్గర భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పుత్తా శివారెడ్డి, ఆర్వీఎస్ దిలీప్, జనార్దన్‌రెడ్డి, రవి, ఆదినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు ప్రకటించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: టీడీపీ మహానాడులో చిత్తశుద్ధితో జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలో తెలుగుదేశం పార్టీ మహానాడు ఈనెల 25 నుండి 29 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహానాడు లో జిల్లా లోని ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణాల పూర్తికి నిధులు కేటాయించాలన్నారు. కడప నగర జనాభా పెరుగుతోందని, నగరం పెద్ద ఎత్తున విస్తరిస్తోందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం, మంచినీటి సప్లై అవసరాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. గతంలో పులివెందుల కేంద్రంగా హార్టికల్చర్ అంతర్జాతీయ ఎగుమతుల ×గ్రేడింగ్ సెంటర్ ఉండేదని దాన్ని పునరుద్ధరించాలన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ లో యువతకు ఉపాధి అవకాశాలు అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కే.శ్రీనివాసులురెడ్డి, సీపీఎం నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు



కో ఆపరేటివ్ కాలనీ ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్ వేయిస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప అర్బన్: కడప ట్రాఫిక్ సీఐ జావీద్ కడప నగరంలో ప్రతి జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనల సూచికల బోర్డులు పెడుతూ , ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను గుర్తించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్స్ వేయించారు. నగరంలోని చిలకల బావి, మట్టి పెద్ద పులి, కోఆపరేటివ్ కాలనీ, మున్సిపల్ కార్పొరేషన్ జంక్షన్ వద్ద ముఖ్యంగా ఎక్కువ యాక్సిడెంట్ అవుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయించారు. అలాగే మరియాపురం చర్చి, విజయదుర్గమ్మ గుడి, ఇక్బాల్ రైస్ మిల్, కలెక్టరేట్ నుంచి ఎస్టేట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయండి

సిద్ధవటం : మండలంలోని జ్యోతి, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, మూలపల్లె గ్రామాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలను శుక్రవారం హౌసింగ్ డీఈ గోపాలక్రిష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన పక్కా గృహాల నిర్మాణ పనులను జూన్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు గృహ నిర్మాణ పనులు పూర్తి చేసుకునేందుకు అదనంగా ఒక్కొక్కరికి రూ. 50 వేలు మంజూరు అవుతున్నాయన్నారు.